


నేరము
సాక్ష్యము
న్యాయపతి. రాజగోపాలం

జనార్ధనరావు మున్సిఫ్ మెజిస్ట్రేట్. ముక్కుసూటిగా పోతాడని ప్రతీతి. బాగా ఆర్థిక స్తోమత కలవాడు. స్వంత కారు గల కొద్దిమంది ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేటులలో అతడొకడు.

ఉదయాన్నే లేచి ఎనిమిది గంటల వరకు ఇంటివద్ద తీర్పులు వ్రాసుకోవడం అతడికి అలవాటు. ఆ ఉదయం ఎప్పటి మాదిరే తనగదిలో కూర్చొని అతడు వ్రాసుకొంటున్నాడు. వీధి గుమ్మంవద్ద ఏదో ఘర్షణ ప్రారంభమయింది. చికాకుగా కలం టేబిలుపైన పెట్టాడు.

'వెంకట్రావ్' అంటూ బంట్రోతుని పిల్చాడు.

వెంకట్రావు వచ్చాడు.

'నేను జడ్జిమెంట్లు వ్రాసుకొంటున్నప్పుడు ఇల్లు నిశ్శబ్దంగా ఉండాలని నీకు ఎన్నిసార్లు చెప్పాను?'

'చిత్తం'

'మరి ఆ గొడవేమిటి?

'ఒక ఆడమనిషి వచ్చిందిసార్. తమతో ఏదో మనవిచేసుకొంటా నంటోంది. అయ్యగారు పనిలోఉన్నారు, వీలులేదు అన్నాను. ఇంటివద్ద ఎవర్నీ చూడరనికూడా చెప్పాను. దానితో నెత్తీనోరు కొట్టుకొంటూ ఏడ్వడం ప్రారంభించింది.'

'లాభంలేదని చెప్పు. గోల చెయ్యకుండా వెంటనే వెళ్లమను.'

'చిత్తం, అలా చెప్పానండి. ఆమె తిరిగి వెళ్ళిపోతున్నది కూడా. కాని అంతవరకు అంతా చూస్తున్న పాపగారు ఆమెను వెనక్కి పిల్చారు. మా నాన్నగారితో చెప్పి నీతో మాట్లాడేటట్టు చేస్తాను. అంతవరకు నువ్వు ఇక్కడే—'

అతడిమాట పూర్తికాకుండానే తండ్రి వద్దకు వచ్చింది పాప. ఆమెను చూడగానే జనార్దనరావు ముఖంలో మందహాసం తొణికిసలాడింది. ఆప్యాయంగా ఆమెను దగ్గరకు తీసుకొని 'ఏం పాపా' అన్నాడు.

'పాపం ఎవరో బీదమనిషి వచ్చింది నాన్నగారు. ఎంతో కష్టంలో ఉన్నదట. మీతో ఏదో చెప్పాలని వచ్చిందిట. ఈ వెంకట్రావు ఇప్పుడు వీలులేదు పొమ్మన్నాడు. పాపం ఏడుస్తూ వెళ్ళిపోతోంది. నేను ఆమెను వెనక్కి పిలిచి 'నువ్వు వెళ్లకు ఇక్కడ కూర్చో. నేను మానాన్నగారితో చెప్పి నీతో మాట్లాడేటట్టు చేస్తాను' అని చెప్పివచ్చాను. ఆమెతో ఒక్కసారి మాట్లాడండి నాన్నగారు' అన్నది పాప.

'ఇప్పుడు వీలులేదమ్మా నాకు చాలా ముఖ్యమయిన పని ఉన్నది.'

'ఒక్కసారి మాట్లాడండి నాన్నగారు. కష్టంలో ఉన్నవాళ్లకి సహాయం చెయ్యాలని మీరేకదా చెప్పారు.'

'అవునమ్మా కాని ఆమె నిజంగా కష్టంలో ఉన్నదోలేదో అంత సులువుగా చెప్పలేం. నువ్వు చిన్నదానివి. ఇప్పటి నుండి అవన్నీ నీకు తెలియవు. పోయి ఆడుకో.'

'నాకు ఎంతో జాలివేస్తోంది నాన్నగారు ఆమెనుచూస్తే. మీకుకూడా జాలి వేస్తుంది. ఆమెతో ఒక్కసారి మాట్లాడండి నాన్నగారు' పాప తనమాట వదల్లేదు.

జనార్ధనరావు కళ్లద్దాలు తీసి టేబిలుపైన పెట్టాడు. కుర్చీలోనుండి లేచాడు. 'సరేనమ్మా, మాట్లాడతాలే నువ్వు వెళ్లి ఆడుకో' అంటూ వెంకట్రావుతో 'ఆమెను తీసుకురా' అన్నాడు.

పాప సంతోషంతో వెళ్లిపోయింది.

ఆగంతుకురాలిని ప్రవేశ పెట్టాడు వెంకట్రావు. ఆమె వస్తూనే 'రక్షించండి బాబు. మమ్మల్ని రక్షించండి' అంటూ జనార్ధనరావు పాదాలపైనబడి ఏడ్వ ప్రారంభించింది.

జనార్ధనరావు పక్కకు తప్పుకొన్నాడు. 'లే నీకు వచ్చిన ఆపద ఏమిటి? నేను చెయ్యవలసిన సహాయం ఏమిటి?' అన్నాడు.

ఆమె లేచింది. కష్టంమీద దుఃఖం దిగమింగింది.

'నాకొడుకు నేరస్తుడు కాదు. వాడు ఏపాపం ఎరుగడు' అన్నది.

'నీ కొడుకెవరు? పేరు?'

'రాము.'

'జైలులో పెట్టారా?'

అవునన్నట్టు ఆమె తల ఊపింది.

'ఎన్నాళ్లయింది?'

'నిన్ననే. వాడు ఏనేరమూ చెయ్యవలసినవాడు కాదు.'

'నిన్న జెయిలులో పెడితే ఆకేసు నావద్దకు విచారణకు రావడానికి కొంత కాలం పట్టుతుంది. ఆ సబ్‌ఇన్‌స్పెక్టరు వద్దకే వెళ్లి మొరబెట్టుకో.'

'వారివద్దకు వెళ్లే వచ్చానండి. ఎంత ప్రతిమాలినా లాభంలేక పోయింది. చాలా కట్టుదిట్టమైన కేసని తాము ఏమీచెయ్యలేమని చెప్పారు. ఆ కేసు తమవద్దకు విచారణకు వస్తుందని, తమరేదైనా సహాయం చెయ్యగలరని విని తమవద్దకు వచ్చాను.'

'ఇంతకీ నీ కొడుకు చేసిన నేరం?'

'మా రాము ఏనేరమూ చెయ్యలేదు. వాడిపైన ఎవరో పగపట్టారు. జైలులో పెట్టించారు. నా కొడుకు దురుసువాడంటే ఒప్పుకొంటాను. చెడుగుణాలు ఇంకేమైనా ఉన్నాయంటే కొంతవరకు నమ్ముతానేమో. కాని వాడు దొంగతనం మాత్రం చెయ్యడు.'

'దొంగతనం చేశాడని జైలులో పెట్టారా?'

'అవును బాబు. నాగభూషణం గారింట్లో దొంగతనం చేశాడని పోలీసులు తీసుకు పోయారు.'

'నాగభూషణం గారంటే—?'

'వారే—పెద్ద మిల్లు యజమాని.'

'నీ కొడుకు వారి మిల్లులో పని చేస్తున్నాడా?'

'చిత్తం, పెద్దకూలిగా పని చేస్తున్నాడు.'

'అసలు ఏమిటి జరిగిందో పూర్తిగా చెప్పు' అన్నాడు జనార్ధనరావు, వినాలని కొంత ఆసక్తి కలగడంతో.

'నిన్న ఉదయం రాము మామూలుగా మిల్లుకి వెళ్లాడు. వాడు వెళ్లాకఎప్పట్లా నేను బజారుకి వెళ్లాను. తిరిగి వచ్చేటప్పటికి తొమ్మిదిన్నర, పది గంటలయింది. ఇక వంట చేద్దామను కొంటున్నాను. ఇంతలో రాముని తీసుకొని కొందరు పోలీసులు మా ఇంటికి వచ్చారు. వాళ్లవెంట నలుగురు, అయిదుగురు, మిల్లులో పనిచేశేవాళ్లు కూడా ఉన్నారు.

'ఎక్కడ దాచావ్? చెప్పు' అన్నాడు ఒక పోలీసు.

'ఇది దౌర్జన్యం. నాకేమీ తెలియదంటూంటే ఎక్కడ దాచానంటావేమిటి?' అన్నాడు రాము గట్టిగా.

'పొగరుమోతుతనంగా మాట్లాడా

# నేరము-సాక్ష్యము

కంటే ఎముకలు విరుగుతాయి జాగ్రత్త' అన్నాడు ఇంకొక పోలీసు.

నాకేమీ తెలియడం లేదు. నిశ్చేష్టురాలినై చూస్తున్నాను.

'దొంగతనం చేసినవాడు ఎక్కడ దాచాడో చెప్తాడా! ఇల్లు సోదా చెయ్యండి' అన్నారు సబ్‌ఇన్‌స్పెక్టరుగారు.

వెంటనే ఇద్దరు పోలీసులు మా ఇల్లు వెతకడం ప్రారంభించారు. పదినిముషాలపాటు వెతికారు. రాము ఆ ఉదయమే మాసినబట్టలు మార్చి తెల్లబట్టలు వేసుకొని మిల్లుకి వెళ్ళాడు. మాసిన చొక్కా స్టాండుకి వేళ్ళాడుతోంది. ఒక పోలీసు దానిని తీశాడు. దానిజేబులో— దాని జేబులో—'

'దానిజేబులో ఏమిటి దొరికింది?' అన్నాడు జనార్ధనరావు.

'ఒక బంగారుహారం. దానితో మా రాము అదిరిపడ్డాడు. 'ఇది అన్యాయం. ఇది మోసం. ఆ జేబులోకి అది ఎలా వచ్చిందో నాకు తెలియదు. ఆ షర్టు నేను విప్పినప్పటికి దాని జేబులో సగభైసలు మాత్రం ఉండేవి. వాటిని మా అమ్మ తీసి ఇస్తే ఈ జేబులో వేసుకొని పనిలోకి వెళ్ళాను. అంతకంటే నాకు ఏమీ తెలియదు' అన్నాడు, ముచ్చెమటలు పోసిపోతూ. నాకు స్పృహతప్పిపోయినంతవరకు వచ్చింది.

'ఆ సంగతి కోర్టులో చెప్పుకో ప్రస్తుతం మాతో రా' అన్నారు సబ్‌ఇన్‌స్పెక్టరుగారు. వెంట వచ్చినవాళ్ళలో కొందర్ని సాక్షులుగా వేసుకొన్నారు. రాముని తీసుకుపోయారు' అని ముగించింది ఆమె కళ్ళు తుడుచుకొంటూ.

'అయితే మీ రాము జేబులో హారం దొరికినా అతడుమాత్రం దొంగ కాడంటావ్' అన్నాడు జనార్ధనరావు చిరునవ్వుతో.

'దానిని మా రాము దొంగతనం చెయ్యలేదండి అయ్యగారు. వాడిమీద కసికట్టి ఎవరో చేసినపని ఇది.'

'మీ రాము అంటే కిట్టనివాళ్ళెవరేనా ఉన్నారా?'

'వాడు ఎంతో మంచివాడు. తోడి పనివాళ్ళ గౌరవం సంపాదించుకొన్నాడు. అయితే ఈ మధ్య ఒక విషయం విన్నాను. కూలీలకు నాగభూషణం మరీ అన్యాయం చేస్తున్నాడని మా రాము ఆయనను ఒకసారి ఎదిరించి అడిగాడు. వీడిమాటలు అతడు లక్ష్యం చెయ్యలేదు. దానితో సమ్మె జరపాలని వాడు అందరినీ ప్రోత్సాహించడం ప్రారంభించాడట. బహుశ అది విని నాగభూషణంగారికి కోపంవచ్చి—'

'అతడే ఈ పని చేయించాడంటావ్.'

'నిజానిజాలు భగవంతుడికే తెలియాలి.'

'పోని, ఎవరో ఆ వస్తువు తెచ్చి మీ అబ్బాయి జేబులో వేసారని నీ ఉద్దేశం. ఎలా వేశారంటావ్? ఎప్పుడు వేశారు?'

'అదే నాకూ తెలియడం లేదు. కాని ఉదయం నేను బజారుకు వెళ్ళినప్పుడు ఇంటికి తాళంవేసి వెళ్ళినట్టు బాగా జ్ఞాపకం. ప్రతిరోజూ అలాగే చేస్తూంటాను. కాని నిన్న ఇంటికి తిరిగి వచ్చి తాళంచెవి పెట్టబోయేటప్పటికి తాళం విడీ ఉండడం గమనించాను.'

'అంటే నువ్వు ఇంట్లోలేని సమయం చూసి, మారుతాళంతో ఎవరో మీ ఇంట్లో ప్రవేశించి, మీవాడు వదిలిపెట్టిన షర్టు జేబులో ఆ నగ పడవేసి, తిరిగి తాళం వెయ్యడం మర్చిపోయి వెళ్ళిపోయి ఉంటాడంటావు. అంతేనా?'

'తిరిగి వెళ్ళిపోయే గడబిడలో తాళం వెయ్యడం మర్చిపోవచ్చును. మారుతాళం చేతులతోనూ, ఇనపపుల్లలతోనూ తాళాలు తియ్యడం సులువని, కాని తిరిగి వెయ్యడం కష్టమనీ అంటారు. ఈ రెండింటి లోనూ ఏదో జరిగిందని నా నమ్మకం.'

'అది నీ నమ్మకం కావచ్చును. కాని అటువంటివి జరగడం అరుదు—కనుక అటువంటివి జరిగాయని నమ్మడం కష్టం.—సరే ఆ క్రిందటిరోజు సాయంత్రం మిల్లునుండి వచ్చాక మీ రాము మళ్ళా ఎక్కడికైనా వెళ్ళాడా?'


'ఆ సాయంత్రం మిల్లునుండి ఆలస్యంగా వచ్చాడు. పనివాళ్ళంతా మీటింగు పెట్టుకొన్నారని చెప్పాడు. భోజనం చేశాక రాత్రి ఆట సినిమాకు వెళ్ళాడు.'

'అతడితో ఇంకెవరైనా వెళ్ళారా?'

'ఏమో—లేదనుకొంటాను.'

'మీ అబ్బాయి విప్పిన షర్టు జేబులో ఆ హారాన్ని ఇంకెవరో వచ్చి పడవేశారంటున్నావే. అది మీవాడి పని అనే ఎందుకు అనుకోకూడదు?'

'రాము అటువంటి పని ఎన్నడూ చెయ్యడండి బాబూ. దేవుడి సాక్షిగా, మీ పాదాల సాక్షిగా ప్రమాణం చేసి చెప్తున్నాను. కని, పెంచి, పెద్దవాడిని చేసిన దానిని, నా కొడుకు సంగతి నాకు తెలియదా? ఇంతకీ ఆ మాసిన చొక్కా



జేబులో నలభై ఐదు రూపాయలు తీసి ఇచ్చినదానిని నేనే. అప్పటికి ఆ జేబులో అంతకుమించి ఇంకేమీ లేవు.'

'ఇంకేమీ లేవా? బాగా గుర్తుకు తెచ్చుకో.'

'నాకు బాగా గుర్తున్నదండి. ఏమీలేవు.'

'సినిమా టిక్కెట్టుముక్క కూడా?'

'లేదు.' అతడు అడిగిన ప్రశ్నలో అర్థం గ్రహించి ఆమె ముఖం వెల వెల బోయింది.

'సాక్ష్యం ఇంత ప్రతికూలంగా ఉండిపోతుంటే నీ కొడుకు దొంగతనం చెయ్యలేదని ఎలా నమ్మమంటావ్?' అన్నాడు జనార్దనరావు చిరాకుగా.

'మేము దొంగలం కామండి. నేను పెద్ద ఇంటినుండి వచ్చిన దానినే. బ్రతికి చెడినవాళ్లం. చదువు సరిగ్గా జరగక, ఇంకొక బ్రతుకుతెరువులేక వాడు ఈ కూలి పని చెయ్యవలసి వస్తోంది.'

'అంతేనా? అతడికి తండ్రి లేడా?'

ఆమె ఒక్కక్షణం సందేహించింది. 'లేడు' అన్నది హీనస్వరంతో.

'మరణించాడా?'

'లేదు' అన్నది వెంటనే.

'మరి?'

ఆమె మళ్లా సందేహించింది. 'మమ్మల్ని వదిలివేశాడు' అన్నది చివరికి.

జనార్దనరావుకి అనుమానం కలిగింది. 'అసలు అతడు నిన్ను వివాహం చేసుకొన్న భర్తేనా? నిజం చెప్పు' అన్నాడు.

'—లేదండి. నన్ను పెళ్లి చేసుకొంటానని నమ్మించి, నా వాళ్లనుండి విడదీశాడు. అంతే. చివరికి మోసగించి నన్ను అధోగతిపాలు చేశాడు.'

'అలా చెప్పు. ఇప్పుడు మీ కుటుంబ సాంప్రదాయం పూర్తిగా బోధపడింది. నువ్వు చెడినదానివి నీ కొడుకు దొంగ. ఏ ముఖంతో నా వద్దకు వచ్చావ్? వెంటనే ఇక్కడనుండి వెళ్లు' అన్నాడు అతడు కోపంతో.

'బాబూ మమ్మల్ని రక్షించండి. నేను చెడిపోయినదానినే కావచ్చును కాని నా కొడుకు నిర్దోషి. మీరు రక్షించకపోతే మేము ఏమై పోవాలి?' అన్నది ఆమె ఏడుస్తూ.

'వెంకటప్పా, ఈమెను తక్షణం ఇక్కడనుండి బయటకు పంపించు' అన్నాడు జనార్దనరావు, ఆమె మాటలు వినిపించుకోకుండా.

* * *


కొన్నిరోజులు గడిచాక రాము కేసు జనార్దనరావు వద్దకు విచారణకు వచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున కేసు చాలా పకడ్బందీగా ఉన్నది. నాగభూషణం గారింట్లో రాము ప్రవేశించడం చూచినట్లు కొందరు సాక్ష్యం చెప్పారు. ఇంట్లో రాము ఎలా ప్రవేశించ గలిగాడో బంగారుహారం ఎక్కడ ఉండేదో, అది ఎలా చేజిక్కించుకొన్నాడో, ఏ. పి. పి. గారు ఎంతో సమర్థతతో కళ్లకు కట్టినట్లు నిరూపించారు. రాము ఇల్లు తుడిచి సోదాచేసినట్లు, అతడు ఆ ఉదయం విప్పిన షర్టు జేబులో హారం దొరికినట్లు పోలీసులు చెప్పారు. పోలీసులు చెప్పినదానిని వెంట వెళ్లి సాక్షుల్ని బలపరిచారు.

రాము డిఫెన్సుకు మిల్లు కూలీలంతా చందా వేసుకొని, యువకుడూ, ఉత్సాహవంతుడూ అయిన ఒక న్యాయవాదిని నియమించారు. యువక న్యాయవాది తనకు అవకాశం ఉన్నంతమేర ప్రాసిక్యూషన్ వాదాన్ని ఖండించాడు. నాగభూషణంగారింట్లో రాము ప్రవేశించడం చూచినట్లు చెప్పిన సాక్షుల్ని సునిశితంగా ప్రశ్నించి, చివరకు రాము ఆ ఇంట్లో ప్రవేశించడం చూడలేదుగాని ఆ వైపు వెళ్లడం చూశామని చెప్పించాడు. సినిమాకు కూడా అదే మార్గమని వాళ్లు ఒప్పుకొన్నారు. బంగారుహారం ఫలానా చోట ఉన్నట్లు రాముకి తెలిసే అవకాశం లేదని, అతడు వాదించాడు. ఇదంతా కేవలం నాగభూషణం ఆడించిన నాటకమని, నమ్మను ప్రోత్సాహిస్తున్న రాముపై ఇది ప్రతీకార చర్య అని కోర్టును నమ్మించడానికి ప్రయత్నించాడు. రాము తల్లినికూడా బోను ఎక్కించాడు.

మూడు వాయిదాలతో విచారణ ముగిసింది. ముద్దాయి తరఫున వాదన బలహీనంగా ఉన్నదని, శిక్షపడడం తప్పదని అందరికీ అభిప్రాయం ధృడపడింది. చివరి వాయిదా మర్నాడే తీర్పు చెప్తారని అందరూ అనుకొన్నారు. కాని జనార్దనరావు మూడురోజుల సెలవుపై హైదరాబాదు వెళ్లినందున జడ్జిమెంటు నాలుగురోజులు వాయిదా పడింది.

* * *

హైకోర్టు న్యాయమూర్తి రామబ్రహ్మంగారు న్యాయవాదిగా ఉంటున్నప్పుడు, జనార్దనరావు కొన్ని సంవత్సరాలు ఆయనకు జూనియరుగా పని చేశాడు. రామబ్రహ్మంగారికి జనార్దన



# నేరము-సాక్ష్యము

జనార్ధనరావంటె చాలా అభిమానం. ఇప్పుడు జస్టిస్ రామబ్రహ్మంగారి కొమార్తెకు వివాహం. జనార్ధనరావుని తప్పక రమ్మంటూ ఆయన ఉత్తరం వ్రాశారు. టెలిఫోనులో చెప్పారు కూడా. అందుకని జనార్ధనరావు మూడురోజుల శలవు తీసుకొని హైదరాబాదు వెళ్ళాడు.

పెళ్లికి జనార్ధనరావు హాజరయినందుకు రామబ్రహ్మంగారు చాలా సంతోషించారు. కుటుంబాన్ని తీసుకు రాలేదేం అని ప్రశ్నించారు.

'ఎల్లుండి మాపాప పుట్టినరోజు. ఆ రోజుకు కొంత ప్రోగ్రాం వేసుకొన్నాం. ఇద్దరం వచ్చేస్తే ఏర్పాట్లు ఆగిపోతాయని మా ఆవిణ్ణి వదిలి రావలసి వచ్చింది' అన్నాడు జనార్ధనరావు.

వివాహం చాలా వైభవంగా జరిగింది. మినిస్టర్లతోసహా చాలామంది విచ్చేశారు. పక్కన కూర్చొని ఆ వచ్చినవారు ఎవరెవరో రామబ్రహ్మంగారి తమ్ముడు జనార్ధనరావుకి చెప్తున్నాడు.

ఆ వచ్చిన జరీకండువా ఎవరు? బాగా పరిచయమైన ముఖంలా ఉన్నదే. వెంకట్రామయ్య కాదు కదా! 'అతను వెంకట్రామయ్య కదూ' అని జనార్దనరావు ప్రశ్నించాడు.

'అతను ఆయన్ను మీకు తెలుసా?'

'చాలాకాలం క్రిందట ఎరుగుదును. అయినా ఇంతమంది పెద్ద మనుష్యుల మధ్యకు ఇతడెలా రాగలిగాడు? ఇప్పుడు హైదరాబాదులోనే ఉంటున్నాడా?'

'వెంకట్రామయ్య ఇక్కడ చాలా పెద్ద కంట్రాక్టరు. కోటికి పడగ ఎత్తబోతున్నాడు. హైదరాబాదులో ముఖ్యమైన పెద్ద మనుష్యులలో ఇతడొకడు.'

జనార్దనరావుకి ఆశ్చర్యం కలిగింది. ఇదివరకు రౌడీ అని పేరుబడి, కొంతకాలం కారాగారశిక్ష ననుభవించిన వెంకట్రామయ్య ఇప్పుడు 'టాప్' మనుష్యులతో కరచాలనం చేస్తూ వాళ్లతో తిరుగుతున్నాడు. కాలం ఎంత ఊహించలేని మార్పులు తెస్తుంది!

క్రమంగా వెంకట్రామయ్య జనార్ధనరావు కూర్చున్నవైపు వస్తున్నాడు. అతడి కళ్లు జనార్ధనరావు పైన పడినై. వెంటనే వాటిలో ఒక్కసారిగా కోపం ప్రజ్వరిల్లింది. ముఖం నల్లబడింది. కాని లేని మందహాసం తెచ్చిపెట్టుకొంటూ జనార్దనరావుని పలకరించాడు.

'క్షేమంగా ఉన్నట్లున్నారు. మెజిస్ట్రేటు అయినారట కదూ. అయినా సర్వీసులోకి రాకుండా ప్రాక్టీసే చేసుకొంటే ఇంకా బాగుండేదేమో. ఇప్పుడు ఏవూళ్లో ఉంటున్నారు? ఎంతమంది పిల్లలు? కొడుకుని కూడా కంటారులెండి. మీకేం వయస్సు మళ్లింది గనకనా. ఎప్పుడు వచ్చారు? ఏందులో వచ్చారు? కారు కొన్నారేమిటి! చాలా సంతోషం. కాంపౌండులో ఉన్న ఎ. పి. వి. నెంబరు ప్లేటు వచ్చకారుమీదేనేమిటి. ఎ.పి.వి.నెంబరు ప్లేటుగల కార్లు ఇక్కడకు రావడం అరుదులెండి. ఎవరు చెప్మా అనుకొన్నాను. రెండురోజులు ఉంటారా? పెళ్లి పూర్తికాగానే వెళ్లిపోతారా? అదేమిటి?'


కుశల ప్రశ్నలు వేస్తున్నాడేకాని తనపైన వెంకట్రామయ్యకు కోపం తగ్గలేదని జనార్ధనరావు పట్టే తెలుసుకొన్నాడు. తను న్యాయవాదిగా ఉంటున్న రోజుల్లో, ఒక కేసులో జనార్ధనరావు వెంకట్రామయ్యకు విరుద్ధంగా పని చేశాడు. ఆ కేసు పట్టపద్దని, తనకు ప్రతికూలంగా పనిచేసిన వారు తేలికగా బయటపడలేరని జనార్ధనరావుకి ముందుగా హెచ్చరికచేస్తూ వెంకట్రామయ్య కబురు పంపాడు. కాని యవ్వనంలో ఉన్న జనార్ధనరావు ఆతడి బెదరింపుకి భయపడలేదు. పైగా మరింత దీక్షతో పనిచేసి వెంకట్రామయ్యకి శిక్ష పడేటట్లు చేశాడు.


అయితే వెంకట్రామయ్య బెదరించిన హాని ఏదీ జనార్ధనరావుకి జరగలేదు. అసలు ఆ శిక్ష పడిన తరువాత వెంకట్రామయ్య ఏమైనదీ అతడికి ఇంతవరకు తెలియనే తెలియదు.

పెళ్లి పీటలమీద కార్యక్రమం రాత్రి ఒంటి గంటన్నరకి పూర్తి అయింది. సభాసదులంతా లేచి ఇళ్లకు వెళ్తిపోతున్నారు. జనార్ధనరావు కూడా లేచి రామబ్రహ్మంగారి దగ్గరకు వెళ్లాడు. 'ఇక నేను కూడా వెళ్తాను. నాకు శలవు ఇప్పించండి' అన్నాడు.

'ఈ అర్ధరాత్రి ఎక్కడికి వెళ్తావ్? మేడమీదకు వెళ్లి హాయిగా విశ్రాంతి తీసుకో. రేపంతా మాతో గడిపి ఆ తర్వాత ఎప్పుడో వెళ్లు' అన్నారు రామబ్రహ్మంగారు.

'లేదండి. ఎల్లుండి మా పాప పుట్టిన రోజు. నేను వెళ్లకపోతే అది ఏడ్చిబుచ్చుకొంటుంది. మీతో సాధ్యమైనంత ఎక్కువ కాలం గడపాలనే కదా ఒక రోజు ముందుగా వచ్చాను. ఇప్పుడు నన్ను వెళ్లనివ్వండి' అన్నాడు జనార్ధనరావు.



రామబ్రహ్మంగారు ఇంకేమీ అటంకం చెప్పలేకపోయారు.

*  *  *

చల్లగా గాలి వీస్తూంటే ఉల్లాసంతో కారు నడుపుకొంటూ పోతున్నాడు జనార్ధనరావు. పాపకు, తమ ముద్దుల పాపకు రేపు పుట్టినరోజు. పది సంవత్సరాలు నిండుతాయి. గతించిన రోజులు ఒక్కసారిగా గుర్తుకు వస్తున్నాయి అతడికి. గత పది, పన్నెండు సంవత్సరాల క్రితానికి, ఇప్పటికి అతడి జీవితంలో ఎంత మార్పు! తను న్యాయవాదిగా ఉండే రోజులలోనే అతడికి వివాహం జరిగింది. ఆ రోజులలో అతడిని విలాసపురుషుడు అనేవారు. కొందరు పూల రంగడనేవారు. వివాహం జరిగిన తరువాత కొంతకాలంవరకు కూడా అతడు తన విలాసాలను సాగిస్తూనే వచ్చాడు. కాని అతడి భార్య తెలివైనది. చాకచక్యంతో అతడిని సరియైన మార్గంలోనికి మార్చింది. జుడీషియల్ సర్వీసుకు ఎప్లై చేయించింది. జనార్ధనరావు మేజిస్ట్రేటు అయ్యాడు.

మేజిస్ట్రేటు అయినప్పటినుండి జనార్ధనరావు పూర్తిగా మారిపోయాడు. ఇది బాధ్యతగల ఉద్యోగం. నలుగురు తన నడవడిని ఎల్లప్పుడు గమనిస్తూనే ఉంటారు. ఎటువంటి నిందలకు అవకాశం ఇవ్వడానికి వీలులేదు. ఎంత తెలివి లేటలో ఈ ఉద్యోగానికి తన భార్య ప్రోత్సహించిందో అతడు అప్పుడు పూర్తిగా తెలుసుకోగలిగాడు. జనార్ధనరావంటే నిప్పులాంటి మనిషి అని ఇప్పుడు పేరు తెచ్చుకొన్నాడు.

ఆడవాళ్ళకి, మగవాళ్ళకి భేదే లేదా అనుకొన్నాడు, జనార్ధనరావు వారు ప్రైవు చేస్తూ. ఎన్నాళ్ళు విలాసంగా తిరిగినా, ఎంతమంది స్త్రీల జీవితాలు నాశనంచేసినా, పురుషుడు తిరిగి సంఘంలో స్థానం సంపాదించుకోగలడు. తిరిగి పెద్దమనిషిగా చెలామణి కాగలడు. కాని తెలిసో, తెలియకో స్త్రీ తప్పుదారిని వెళ్తే ఆమె బ్రతుకు అథోగతిపాలు కావలసిందే. ఇక ఆమెకు సంఘంలో స్థానం లేదు. అతడికి అకస్మాత్తుగా రాము తల్లి జ్ఞాపకం వచ్చింది. ఆనాడు, తనతో మొరపెట్టుకోవడానికి ఆమె వచ్చినప్పుడు, మళ్ళ




# రకూన్

## - రంగుల రాట్నం :-

డాక్టర్ కోనేటిరావు

జర్మనీవాళ్ళు దీన్ని చిత్రంగా పిలుస్తారు, "ఉతికే ఎలుగు" అని. చూడడానికి ఎలుగుబంటి పోలికలు ఉన్నా పిల్లి అంతే ఉంటుంది. ఎలుగులాగే దీని పాదాలు పూర్తిగా నేలని ఆన్తాయి. ఇది నీటిలో ఉండే జంతువు కాదు. అయినా ఆహారం దొరికినప్పుడు ఎంత దూరాన ఉన్నా నీళ్ళ దగ్గరకు తీసికెళ్ళి, దాన్ని కడిగి—అంటే ఉతికి—కానీ తినదు. నీటిలోనుంచి తీసిన చేపనైనా సరే మంళ్ళి దాన్ని నీటిలో ముంచి కాని తినదు. ఉనతలాగా రెండు "చేతుల్తో" పట్టుకొని నీటిలో మళ్ళీ మళ్ళీ ముంచి తన ఆహారాన్ని కడుగుతుంది. దీని ఆహారం చేపలు, నత్తలు, కప్పలు, తొండలు పురుగులు ఇంకా వీలైతే పక్షులు. ఇవికాక పొలాల్లోని పచ్చని మొక్కజొన్న కంకులు కూడా తినేస్తుంది.

రకూన్ చాలా నాశనకారి. అందుకే వ్యవసాయదారుడికి దీనిపేరువింటేనే క్రోధం. తిన్ని జొన్న పెట్టుని తినేయడమే కాకుండా, మిగతా వాటిని నాశనం చేస్తుంది తనేది ఒకటి రెండయినా, పిల్లనన్ని కోళ్ళను చంపేస్తుంది. అందుకే దీని తరిమి కుక్కల్తో వేటాడి చంపుతారు. రక్షణకి ఒక చెట్టెక్కి దాక్కొంటుంది. అప్పుడు దీన్ని కొట్టేస్తారు. కుక్కలు దీన్ని చంపేస్తాయి. దీని మాంసం కూడా రుచిగా ఉంటుందిట.

పెంపకానికి రెకూన్లు—కూన్లు అని ముద్దుగా అంటారు—బాగుంటాయి. కాని వీటికి అవసర వస్తువని, అనవసర వస్తువని ఉండదు. వీలయితే ఇంట్లో ఉన్న ప్రతి వస్తువును పరిశీలించికాని వదలదు. ద్రాళి వంటుగది, సామాను గది తలుపు వేయడం మర్చిపోతే సామన్లకి ప్రతిదాన్ని పరీక్షచేసి కంగాళీచేసి వదుల్తుంది. ఇలాటి వాటికి దీన్ని పెంచుకొనేవాళ్ళు సిద్ధంగా ఉండాలి. దీని ఆటలు సరదాగా ఉంటాయి. ముఖ్యంగా పిల్లలతో ఆటవస్తువును వదిలేసి వీసి, చిన్న పిల్లలా ఆడుకొంటుంది.

"పండా" అనే పేరు విని ఉంటారు, జవహర్లాల్ నెహ్రూగారికి ఇవి పెంపుడు జంతువులుగా ఉండేవి. ఇవి రెకూన్‌లకు సంబంధించినవే. చైనా టిబెట్టు ప్రాంతాల్లో ఉంటాయి. వీటిలో ఒక జాతి 5, 6 అడుగులు పొడవు. మరొక జాతి పిల్లల్లాగా చిన్న జాతి. వెదురుపైన మామూలుగా తిరుగుతాయి. నేలమీద కొంచెం కష్టంగా నడుస్తాయి. లేత వెదుళ్ళమీద ఇవి ఆధారపడతాయి. మాంసాహారానికి కూడా అభ్యంతరం చెప్పవు. పిల్లిలాగా గోళ్ళు కొద్దిగా ముడుచుకొంటుంది. ఈ శక్తి రకూన్లకు, ఎలుగులకూ లేదు. ఎలుగుబంటిలాగా 'గుర్రు'శబ్దం చేస్తుంది. కోపం వచ్చిన పిల్లిలాగా బుసలు కొడుతుంది.

భ్రష్టురాలు అని తను నిందించాడు. పాపం ఆమె పశ్చాత్తాప పడిందేమో. ఆమె చెప్పింది అబద్ధం కాదేమో. నిజంగా ఆమెను ఏ పురుషుడైనా అన్యాయం చేశాడేమో.

చీకటిని భేదించుకొంటూ కారు ఉత్సాహంగా ముందుకు సాగిపోతున్నది. ఇక కొద్ది సేపట్లో తెలంగాణా ప్రాంతంలో నుంచి 'ఆంధ్ర'లో ప్రవేశిస్తాం అనుకొన్నాడు జనార్దనరావు, ఆలోచనలు మార్చుకొంటూ. ఏది తెలంగాణా, ఏది 'ఆంధ్ర'? రెండింటిలోనూ రోడ్డు ఒక్క మాదిరిగానే ఉన్నది. చెట్లు, కొండలు, మనుష్యులు, పశువులు — ఎందులోనూ తేడా కన్పించదు. సృష్టిలో తేడా లేనప్పుడు ఈ ప్రాంతీయ విభేదాలు కల్పించుకోవడం కేవలం అవివేకం అనుకొన్నాడు.

రోడ్డుకు అడ్డంగా, తెల్లగా, దూరాన్ని ఏదో కన్పించడంతో అతడి ఆలోచనకు అంతరాయం కలిగింది. మరి కొంత ముందుకు పోయాక అది గేటు అని తెలుసుకొన్నాడు. ఇక్కడ రైలుగేటు లేనట్లు అతడికి జ్ఞాపకం. కారు వేగాన్ని తగ్గిస్తూ హారన్ కొట్టాడు. చీకట్లో నుండి ముగ్గురో, నలుగురో వెలుగులోకి వచ్చారు. గేటు మాత్రం తెరవలేదు. జనార్దనరావు తప్పనిసరిగా కారు ఆపాడు.

'ఎవరయ్యా మీరు?'

'ప్రొహిబిషన్ చెక్‌పోస్టు.'

'అలాగా—త్వరగా కానివ్వండి'

ఒక పెట్టీ ఆఫీసరు, ఒక గార్డు, కారంతా సోదా చేశారు.

'ఇక గేటు తెరవండి' అన్నాడు జనార్దనరావు.

'డిక్కీ కూడా చూడాలిసార్.'

'ఓహో, మాలాటివాళ్ళ కార్లనే మీరు అతి జాగ్రత్తగా చూస్తారనుకొంటాను. కేసులకొద్దీ బ్రాందీలు, విస్కీలు దొంగతనంగా రవాణా చేసే లారీలకు మాత్రం మీ గేటు ఎల్లప్పుడూ తీసే ఉంటుంది' అన్నాడు జనార్దనరావు హేళనగా.

'సార్, ఎందుకా అనవసరపు మాటలు? మా డ్యూటీ మేము చెయ్యక తప్పదు. డిక్కీ తెరవండి' అన్నాడు పెట్టీ ఆఫీసరు.

'ఇలా కబుర్లు చెప్పేవాళ్ళే బ్రాందీ



సీసాలు బాగా రవాణా చేస్తారు' అన్నాడు ఒక గార్డు, దూరం నుండి చిన్న గొంతుకతో.

రుసరుస లాడుతూ జనార్దనరావు కారుదిగాడు. డిక్కీవద్దకువెళ్ళాడు. తాళం చెవి పెట్టి తిప్పాడు. కాని అది తిరగడం లేదు.

'అసలు తాళం వెయ్యలేదేమో. హేండిల్ తిప్పి చూడండి' అని పెట్టీ ఆఫీసరు సలహా ఇచ్చాడు.

'నేను తాళం వేసానయ్యా' అన్నాడు జనార్దనరావు. కాని అతడి సలహా ప్రకారం హేండిల్ తిప్పి చూచాడు.

పెట్టీ ఆఫీసరు చెప్పిందే నిజమయింది. హేండిల్ తిరిగింది.

నేను స్వయంగా తాళం వేశానే. ఎలా విడిపోయింది? అని కొద్దిగా ఆశ్చర్య పోయాడు జనార్దనరావు. 'తలుపు తెరచి త్వరగా తనిఖీ చేసుకోండి' అన్నాడు పెట్టీ.

ఒకగార్డు డిక్కీ తలుపు తెరిచాడు. పెట్టీ ఆఫీసరు టార్చిలైటు వేసి లోనికి చూచాడు.

ఇది మీకు తెలుసా!

### పొట్టు

పప్పులు చేసినప్పుడు పొట్టు పారేయకూడదు. దీనితో పాటే పోషకపదార్థాలలో ముఖ్యమైన జెర్మ్ పోతుంది.

పప్పులు - మొలకెత్తించి, పులియపెట్టి వాడితే-వాటి ఆహారపు విలువ పెరుగుతుంది.

ఉడికించి, రుబ్బి, వేయించి పప్పులని సులభంగా జీర్ణం అయ్యేలా చేయవచ్చు.

పప్పులు పురుగు పట్టకుండా ఉండాలంటే దోరగా వేయించి స్టోరు చేయాలి,

—కె. రా.

'రెండూ, రెండు నాలుగు రెండు ఆరు బ్రాందీ సీసాలు' అన్నాడు చిన్న ఈల వేస్తూ.

'ఏమంటున్నావ్?' అన్నాడు జనార్దనరావు అదిరిపడి. డిక్కీలోకి చూచాడు. ముందు భాగంలో తన సూటుకేసు ఉన్నది. దానివెనక, ఒక పెట్టెలో ఆరుసీసాలు కన్పించాయి.

'ఇవి—ఇవి —' అంటూ తడబడుతున్నాడు జనార్దనరావు.

'మీరు స్టేషనులోకి రావాలి' అన్నాడు పెట్టీ ఆఫీసరు.

జనార్దనరావు యాంత్రికంగా వాళ్ళ వెంట స్టేషనులోకి వెళ్ళాడు. అతడి తలలో సుడిగుండాలు తిరుగుతున్నై. తన కారులో ఎవరు పెట్టారు ఈ సీసాలు? ఎప్పుడు పెట్టారు? ఎందుకు పెట్టారు? మనస్సు నిలదొక్కుకొని జరిగినదంతా ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు. రామబ్రహ్మంగారి బంట్రోతు తన సూటుకేసు డిక్కీలో వేసినప్పుడు తను లోనికి చూచాడు. అప్పటికి అందులో ఈ సీసాలు డెఫినెట్‌గా లేవు. వెంటనే తనే స్వయంగా తాళంవేశాడు. ఆ తర్వాత ఇంతలో వెంకట్రామయ్య, మరి కొందరు పరిచితులు తనవద్దకు వచ్చారు కాఫీ తీసుకొని వెళ్ళమన్నారు. తను వద్దన్నా వెంకట్రామయ్య బలవంతం చేశాడు. అందరూ తిరిగి హాల్లోకి వెళ్ళారు కాఫీ తాగి వాళ్ళతో ఒక అరగంట ఏవేవో మాట్లాడి తను మళ్ళా బయల్దేరాడు. ఆ అరగంటలోనే ఇది జరిగి ఉండాలి. ఇప్పుడు జనార్దనరావుకు పూర్తిగా అర్థమయింది ఇది వెంకట్రామయ్య చేయించిన పని. ఆ అరగంట వ్యవధికోసం తనను బలవంతంచేసి కాఫీమిషతో హాల్లోకి తీసుకు వెళ్ళాడు. తనపరువు ప్రతిష్ఠలు మంటకలపడానికి ఈవిధంగా చేశాడు. పాతపగ ఈవిధం తీర్చుకొన్నాడు.

'మిస్టర్—నువ్వు పెట్టీ ఆఫీసరను కొంటాను. ఈ సీసాలు నేను తెచ్చినవికావు. ఇది నాపైన ద్వేషంతో ఎవరో చేసినపని. మీ ఎస్. ఐ. ని పిలువు.' అన్నాడు జనార్దనరావు.

ఒక గార్డుచాత సబ్ఇన్‌స్పెక్టరుకి కబురు చేశాడు పెట్టీఆఫీసరు.

కొంతసేపటికి సబ్‌ఇన్‌స్పెక్టరు వచ్చాడు. తను ఎవరో జనార్ధనరావు అతడికి చెప్పాడు. నిర్ధారణకు తన డ్రైవింగు లైసెన్సు చూపించాడు. తను ఎక్కడికి వెళ్ళాడో, ఎందుకు వెళ్ళాడో చెప్పాడు. బ్రాందీ సీసాలు తన కారులోకి ఎలా వచ్చి వుంటాయో, అది ఎవరు చేసిన పనిగా తను భావిస్తున్నాడో, అలా భావించడానికి గల కారణాలు కూడా వివరంగా తెలియచేశాడు.

సబ్‌ఇన్‌స్పెక్టరుకి ఏమిటి చెయ్యాలో తెలియలేదు. మేజిస్ట్రేటయినా, నేరం చేసినప్పుడు శిక్ష అనుభవించక తప్పదు. అతడి హోదా చూసి విడిచిపెట్టే ప్రశ్నే లేదు. కాని ఇతడు ఏదో చాలా గొడవ చెప్పాడు. బ్రాందీసీసాలు తను తీసుకొని రాలేదని, ఎవరో తనపైన నేరం మోపడానికి చేసిన పని అని అంటున్నాడు. ఇది ఎంతవరకు నమ్మడం?

ఇంతలో అతడికి ఒక ఆలోచన వచ్చింది. 'మా ఆఫీసరుగారు ఈ ఉదయం ఇక్కడికి వస్తారని ప్రోగ్రాము వచ్చింది. వారు వచ్చేవరకు మీరు ఆగండి. వారి సలహా లేనిదే నేనేమీ చెయ్యలేను. ఈలోగా మీరు కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఇక్కడ కావలసిన సదుపాయాలు ఉన్నై' అన్నాడు.

కాలకృత్యాలు తీర్చుకొని స్టేషను అనబడే ఆ రేకుల షెడ్డులో తిరిగి కూర్చొన్నాడు జనార్ధనరావు. తూర్పు బాగా తెల్లవారింది. ఈ సరికి తను ఎంత దూరం వెళ్ళేవాడో. ఈ గొడవకి పర్యవసానం ఎలా తేలుతుందో. అసలు తను ఎప్పటికైనా ఇల్లు చేరగలడా? దీనితో తన భవిష్యత్తు కూడా దెబ్బతింటుందేమో అని దిగులుగా ఆలోచిస్తున్నాడు. మనిషి పూర్తిగా బెదిరిపోయాడు.

కొంతసేపటికి డి. పి. వో. వచ్చాడు. సబ్ ఇనస్పెక్టరు జనార్ధనరావు కేసంతా అతడికి సవివరంగా తెలియచేశాడు. జనార్ధనరావు కూడా మొదటినుండి తన కథ పూర్తిగా అతడితో చెప్పాడు. డి. పి. వో వేసిన కొన్ని ప్రశ్నలకి సమాధానాలు చెప్పాడు.

సబ్‌ఇన్‌స్పెక్టర్ని, పెట్రోల్ ఆఫీసర్ని దూరంగా తీసుకొని వెళ్ళి ఆ అధికారి వాళ్ళతో కొంతసేపు మాట్లాడాడు. తిరిగి ముగ్గురు జనార్ధనరావు వద్దకు వచ్చారు.

'మీరు చెప్పింది యదార్థమని, మీరు నిర్దోషి అని నేను ఒక నిర్ణయానికి వచ్చాను. వీరి ఇద్దరి అభిప్రాయం కూడా అదే. ఈ సీసాలు ఏమిటి చెయ్యడం అని కూడా ఆలోచించాం. వీటిని బద్దలు కొట్టి భూమిలో పాతిపెట్టడం ఒకటే మార్గం కనిపిస్తోంది. అలా చెయ్యడం పద్ధతికి విరుద్ధమనుకోండి. కాని ఒక నిర్దోషిని కాపాడడానికి ఆ మాత్రం చిన్న తప్పు చెయ్యడం ఫరవాలేదనుకొంటాను' అన్నాడు ప్రొహిబిషన్ ఆఫీసరు.

అతడి ఆజ్ఞ ప్రకారం ఇద్దరు గార్డులు సీసాలని చితగ్గొట్టి భూస్థాపితం చేశారు.

'మీ మేలు ఈ జన్మలో మరచిపోలేను. నేను హడలిపోయానంటే నమ్మండి. నేను నేరం చేసినట్లు ప్రత్యక్షంగా సాక్ష్యం కనబడుతోంది. నేను నిరపరాధినని ఎలా రుజువు చేసుకోగలను? అని చాలా దిగులుపడ్డాను. మీకు సర్వదా కృతజ్ఞుణ్ణి' అన్నాడు జనార్ధనరావు లేస్తూ.

'దానికేముందండి. ఒక వ్యక్తి నేరం చేసినట్లు కనబడుతుంది. కాని అది అతడు చేసింది కాకపోవచ్చును. కేవలం అది అతడిపైన మోపబడినది కావచ్చును. అటువంటప్పుడు దానికి తగిన సాక్ష్యం కూడా ఏర్పాటు జరుగుతుంది. కాని సాక్ష్యాన్ని—మీరు మేజిస్ట్రేటుగా ఉంటున్నారు. ఇదంతా మీకు నేను చెప్పడమేమిటి?' అన్నాడు డి. పి. ఓ. నవ్వుతూ.

'మీరు చెపుతున్నది వినాలని నాకు చాలా ఆసక్తి కలుగుతోంది. పూర్తిగా చెప్పండి.'

—'కాని ఆ సాక్ష్యాన్ని మనం జాగ్రత్తగా పరిశీలిస్తే, నిజం మనకు ఏమూలనుండో మినుకు మినుకుమంటూ కనిపిస్తుంది. దానిని మనం నిర్లక్ష్యంగా విడిచిపెట్టకూడదు. తగిన ప్రాధాన్యం ఇవ్వాలి. అలా ఇచ్చిననాడు ఎవరు దోషులో ఎవరు నిర్దోషులో తెలుసుకోగలం. మీ కారు ఆపినప్పటినుండి జరిగినదంతా మా పెట్రోల్ ఆఫీసరు చాత చెప్పించి విన్నాను. మీరు నిరపరాధులని తెలుసుకోవడానికి కొన్ని ఆధారాలు కన్పించాయి. ఇంతే నేను చెప్పబోయింది. పాపం ఇప్పటికే మీకు చాలా ఆలస్యమయింది. ఇక మీరు వెళ్ళండి' అంటూ జనార్ధనరావుని కారువరకు దిగబెట్టాడు డి. పి. వో.

జనార్ధనరావు తిరిగి కారు స్టార్టు చేశాడు. దారిపొడుగునా దీర్ఘంగా ఆలోచిస్తునే ఉన్నాడు. ఆలోచన పూర్తి అయ్యేసరికి తన వూరు చేరుకొన్నాడు.

మర్నాడు జనంతో కిటకిట లాడుతున్న కోర్టులో నిందితుడు రాము నేరం చేసినట్లు పూర్తిగా సందేహనివృత్తి కాలేదని, అతడిని విడిచిపెట్టాలని తీర్పు ఇచ్చాడు జనార్ధనరావు. ●

(ఇది ప్రొహిబిషన్ ఉన్నప్పుడు రాసిన కథ)

